



# ప్రథమాంకము

—:o:—

పరిదేశము: రఘునాథరావుగారి మేడమీఁది కచేరిచావడి.

ప్రవేశము: రఘునాథరావుగారు పడకకుర్చీలోఁ గూర్చుండి పత్రిక చదువుకొనును.

రఘు—(చదువు నిలిపి, యొక్కనిట్టూర్పు పుచ్చి) మొత్తముమీఁదఁ బరిస్థితు లన్నియు బహుభయంకరములుగా నున్నవి!

చ. కలహ మొకవంక! జాతిమత♦కక్ష లొకానొకవంక! హత్యలున్
మరణము లొక్కవంక! దయ♦మాలిన ధర్మవిరుద్ధ చర్యలున్
జెయిలు లొకవంక! నోటికిని ♦ జేతికిఁ గట్టడ లొక్కవంక! ఇ
త్తెఱఁగున దేశ మెల్ల నతి♦దీనదశావశ మయ్యెనే మనన్!

చ. తలఁకని స్వేచ్ఛతోఁ, బలుపు ♦ తప్పియెఱుంగని పౌరుషంబుతో,
నెలకొను శాంతితో, దిశలు ♦ నిండిన కీర్తితో, సమృద్ధితోఁ
బొలఁగని భోగభాగ్యముల♦తోఁ, దులఁదూఁగిన దేశ మిప్పు డీ
స్థితులు తలక్రిందులై, కుడిచె♦డు నిమితిలేని విపత్పరంపరల్!

(క్షణ మూరకుండి) మనదేశమున కెన్నఁడైన మరల మంచి యోగము పట్టునా!—ఎక్కడి యోగము—ఎక్కడి లోకము!

సీ॥ కొంపలు తెగినమ్మ ♦ కోర్టుల, [illegible]ళ్ళఁ, గా
ఫీ హోటళ్ళ, వకీళ్ళఁ ♦ బెంచువారు
పండిన నరకల్లఁ ♦ బరదేశముల కంపి
కడుపున కెర వేయు ♦ పలుచువారు
మూఁడుప్రొద్దుల ముష్టి ♦ మూన్సిపల్ మెంబరు
పదవిలోఁ గనులు క♦న్నడనివారు

శర్మ—అనహాయవాదులు కారు సరిగదా- హరిహరాదులు కూడ దాని నంత మొందింప లేరు ! ఏ మందురా?- వారి నడ్డుకొనఁ గల మహానుభావులు వైస్రాయి నభలోఁగూడఁ గలరు ! ఆ పైని- ఎలెక్షనులలో దాని కిప్పు డెక్కడలేని ప్రాముఖ్యతయుఁ గలిగినది ! విన్నారో లేదో- మొన్నటి మ్యూనిసిపల్ యెలెక్షను నందర్భమున- సారాకొట్లు, మ్యూనిసిపల్ కచేరీలమధ్య, వోటర్లు- తిరుపతి మొక్కుల బిచ్చగాండ్రవలె తీట తీఱ దొరలినా రఁట! దీని కేమి గాని- క్లబ్బులో గానసభ యఁట- వెళ్ళుదమా?

రఘు—చీట్లాట గుంపులో మనక్లబ్బు- శివగంగ తిరునాళ్ళను మించి యుండును గదా- ఆగందరగోళములో గానసభ కూడనా !

శర్మ—అసలు, మీకు, సంగీతమునందుఁ జవి కలదా ?

రఘు—సంగీతమునందుఁ జవి లేకపోలేదు గాని-

చ॥ బిరడలు త్రిప్పి, తంత్రులను ♦ బెళ్ళున త్రెంచి, ముదు ల్ఘటించి, తం
బుర శ్రుతి చేసి. గొంతుకపం♦ముక్ సకిలింపుల నెట్టి, గూబపై
కరము గదించి, వాతపొరి ♦ క్రిమ్మిన చందమున న్వికార వై
ఖరి సభలోన గింజుకొను ♦ గాయకుఁ డన్న నసహ్యమే జుమా !

శర్మ—అట్లయిన, మీ కాఁడుపాటపై నాదరము హెచ్చన్నమాట !

రఘు—ఆఁడుపాట యన్న జ్ఞప్తికి వచ్చినది. మొన్నరాత్రి యీవీధి నొక పెండ్లియూరేగింపు వెళ్ళినది. ఆయూరేగింపు మేజువాణీలో నొకతె పాడినది గదా-ఆ స్వరమాధుర్య మే మని చెప్పుదును!

శర్మ—స్వరమాధుర్య మేనా- దాని సౌందర్యమాధుర్యము కూడఁ జిత్తగించినారా?

రఘు—అంతవఱకు జరుగుట కవకాశము లేకపోయినది.

శర్మ—(తనలో) సెబాసు ! అవశ్యైన ఆపర్ట్యూనిటీ (Opportunity) దొరికినది ! ఈసందర్భములో సీతనికి మమత కలిగించి, దాని యింటికిఁ దార్పఁగలిగితినా- నాయదృష్టము నాలుగుకాళ్ళమీఁద

(అని యెదుట నెవరో యున్నట్లు తన్నఁబోయి, వెలికిలఁ బడి) కా లేదు- పిత్తు కా లేదు! కావలిస్తే యీఁవు సూసుకో! కూకుంటే కుక్కపిల్ల- లెగిస్తే లేడిపిల్ల- కాదన్నావోడు గాడ్దిపిల్ల! ఇదుగో- లేస్తున్నా- లేశా! (అని లేవఁబోయి మరలఁ గూలఁబడి) ఓరి! పట్టి కొడ్తే యిల్లా కొట్టాలి! పైల్వానోళ్లంతా- నామీద నుంచి బలాదూరు! దీనిమీ దింకో డ్రాం పడితే- దిక్కటీలా గెలిగా నన్న మాటే! (అని యెట్లో లేచి)

త్రియ్యాని మాఁవీడి పండ్రూ- పండ్రూ-
త్రినబోతే దొరకాదు- త్రీపూలు మొండ్రూ. త్రియ్యా.

త్రీపులు మొండ్రు- త్రీ-పు-లు-మొండ్రు! ఎందులో వుంది త్రీపి? సెప్పుకుంటే- పేరు సారా పెజెటు! మాఁవిడిపండ్రు త్రీ పన్నావోడు- మాదిగాడి కొడుకు! ఇష్టఁవొచ్చినంత త్రీపి యీఁత కల్లులో వుంది! టాటికల్లు- టల్లి; యీటకల్లు- పెళ్లాం! ఇహిహిహీ! ఇహిహిహిహీ! ఇహిహిహిహిహీ! ఈటకల్లు త్రాగే- యిందురుడు- సెందురు డయ్యాడు! ఈటకల్లు త్రాగే- యిష్టామిత్తురుడు-యీరబద్దురు డయ్యాడు! ఇహిహిహీ! ఇహిహిహిహీ!

ఇప్పు డెల్లి త్రాగుటాను- యీఁట కల్లు,
తరవా తెల్లి త్రాగుటాను- తాటి కల్లు;
పగ లెల్లి త్రాగుటాను- పట్ట సారా.
రాతి రెల్లి త్రాగుటాను- రమ్ము సారా.

(చరాలున బ్రక్కకుఁ జూచి) ఎవడా యెక్కిరించేవోడు! ఎక్కిరించినోడి గుండి మీఁద- యెగిరి తన్తా! కైదులో కెళ్ళొచ్చాననా- కళ్ళు మిడకరిస్తున్నావు? కన్నఁవే శెళ్ళానా- కైదులోకి? త్రాగడానికి డబ్బు లివ్వకపోతే- త్రలకాయ వగలే శెళ్ళాను! ఆర్నెల్లు కూకుండి- హాయిగా తినొచ్చాను! మల్లీకొడ్తాను-మల్లీ యెల్తాను! సర్కారోడు జైల్లో సారాకూడా పొయ్యిస్తే-సచ్చిందాకా జైల్లోనే వుంటాను!

అపనా - తన్నా - మన్నా - మారోరి బై రన్నా॥ అపనా॥
మారోరి బై రన్నా - మంచోడు బై రన్నా। అపనా॥
షింతషెట్టూ షిగురు షూడు - షిన్నదాని పొగరు షూడు,
రాజమండ్రీ యెల్లిషూడు - రమ్మ షాగా టాగ్రి షూడు॥ అపనా॥

(ముందునకుఁ జూచి) ఎవఁడా వచ్చేవోడు ?- షెర్మలా గున్నాడే ?- ఆడే- ఆడే. బాబుగారి షొమ్మంతా యీాడు వడ దినేస్తున్నాడు! ఈపూట కర్జు- యీాడిదగ్గిర లాగాలి. కాష్టేవు పెద్దమనిషిలాగు కనపడతా! (శరీరము బిగఁబట్టి నిలుచుండును.)

శర్మ—(ప్రవేశించి, చూచి, యులికిపాటుతో) ఇదుగో- యీాటెర్రిబిల్ ఫెల్లో (Terrible fellow) యెప్పుడో జైలునుండి దిగినాఁడే! మరల నూరిలో మరిడీదేవత ప్రవేశించిన దన్న మాటయే! ఈ రాస్కెల్ (Rascal) కంటఁబడకుండ నీ ప్రక్కసందునఁ బడి పోదునా ? (ఆలోచించి) కాదు కాదు- ఇటువంటివాని కేమయిన చేపుచు, చేతిలో నుంచుకొనుటయే మంచిది. అవసర మైనచో- విశ్వాసరావు నొకసారి వీనిచే నుతి కింపను వచ్చును. (అని నడచును)

రంగ—దణ్ణాలండి బాబూ దణ్ణాలు! తఁవరికోసఁవే షూస్తున్నా!

శర్మ—ఇదిగో- వచ్చినావా ?- యీామధ్య నీవు లేక యూరంతయు జిన్నబోయినది!

రంగ—షిత్తం షిత్తం! రంగడిషంగతి మీారు కనిపెట్టారు! మీా పాదాలు పట్టుకుంటే- పాపాలు పోటాయి! (అని పాదములపైఁ బడును.)

శర్మ—పోయినవి- నీ పాపము లన్నియు పోయినవి- లెమ్ము.

రంగ—నే లేవను!- ఈపూట కర్జు మీారివ్వాలి- నే లేవాలి!

శర్మ—ఇంతే గద ?- ఈ పూఁటనే కాదు- ఇది మొదలు నీవు లేనప్పు డెల్ల యిచ్చెదను. ఇఁక లేచి, నాతో రమ్ము.

రంగ—(లేచి) వో- అల్లాగైతే- మీా అడ్డరు పెకారం నడుస్తా! మీారు తిట్ట మన్నోణ్ణి తిడ్తా- మీారు కొట్ట మన్నోణ్ణి కొడ్తా! (అని వెంబడింపఁగా- ఇరువురు నిష్క్రమింతురు.)

